సాక్షి
గుంటూరు
ఆదివారం । 4 । ఆగస్టు । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 4,500 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1,279 క్యూసెక్కులు వదిలారు.



అమ్మవారికి సారె సమర్పణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆలయ సెక్యూరిటీ విభాగం శనివారం సారెను సమర్పించింది.

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి తాడేపల్లికి చెందిన ముళ్లపూడి వెంకట సత్య భగవాన్ శనివారం రూ.1,01,116 అందజేశారు.



న్యూస్‌రీల్

ప్రభుత్వ ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 26లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ బి.సాయి వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ, టీసీ, విద్యార్థి, తల్లిదండ్రులు ఆధార్ జిరాక్స్, విద్యార్థి ఫొటో, సెల్ నంబరు, మెయిల్ ఐడీ, చిరునామా వివరాలతో ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా ప్రైవేటు నెట్ కేంద్రాలతో పాటు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈనెల 27న సర్టిఫికెట్ల, 29న కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

అనధికారిక వెంచర్లపై సీఆర్డీఏ కొరడా



తాడికొండ: మండల పరిధిలోని లాం, తాడికొండ అడ్డరోడ్డు, నిడుముక్కల, తాడికొండలో అనుమతులు లేని వెంచర్లపై శనివారం సీఆర్డీఏ అధికారులు కొరడా ఝుళిపించారు. అక్రమ నిర్మాణాల్ని గుర్తించి జేసీబీల సాయంతో తొలగించారు. నిబంధనల ప్రకారం వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసి విశాలమైన రోడ్లు, కమ్యూనిటీ స్థలం, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వసతులు ఏర్పాటు చేసి అమ్మకాలు చేయాలి. రాజధాని పేరుతో ఇటీవల ఇబ్బడిముబ్బడిగా వేసిన వెంచర్లను నిబంధనలకు విరుద్ధంగా అమ్మేసుకొని పలువురు సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై సీఆర్డీఏ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఎట్టకేలకు చర్యలకు ఉపక్రమించారు. నోటీసులు జారీ చేసినా పలు వెంచర్ల నిర్వాహకులు పెడచెవిన పెట్టడంతో శనివారం కొరడా ఝుళిపించారు. సీఆర్డీఏ జోనల్ డెప్యూటీ డైరెక్టర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో అధికారులు స్టాలిన్, రాజేష్, వంశీ, రెహమాన్, అనిల్ పాల్గొన్నారు. సీఐ సీహెచ్ ప్రభాకర్, ఎస్‌ఐ అంజయ్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

9న హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం ఎంపికలు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంటర్మీడియెట్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9న హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. ప్రణయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీ రంగంలో కెరీర్‌ను ప్రారంభించేందుకు ఆసక్తి కలిగి, 2023, 2024 సంవత్సరాల్లో ఇంటర్ నాన్ మాథ్స్ (సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, ఒకేషనల్) కోర్సులను 75 శాతం మార్కులతో పూర్తి చేసిన యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్లతో పాటు ఆధార్ ఫొటోస్టాట్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో గుంటూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 9వతేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న హెచ్‌సీఎల్ ఎర్లీ ట్రైనింగ్ ప్రోగ్రాం ఇంటర్వ్యూలకు నేరుగా హాజరుకావాలని సూచించారు. రాత పరీక్ష, హెచ్ఆర్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల్ని ఎంపిక చేస్తామని, ఇతర వివరాలకు తమ ప్రతినిధి మణిదీప్‌ను 80746 07278 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అధికారుల ముసుగులో టీడీపీ బరితెగింపు

నరసరావుపేటటౌన్: అధికారుల పేరు చెప్పి టీడీపీ నాయకులు బెదిరింపులకు దిగిన వైనమిది. వివరాల్లో కెళితే.. పట్టణానికి చెందిన నంబూరి వేణుగోపాల్‌రెడ్డి గేదెల ఫారాలకు పశువుల దాణా సరఫరా వ్యాపారం చేస్తూ ఉంటాడు. అతని వద్ద పనిచేసే ఆటో డ్రైవర్ శుక్రవారం రాత్రి పాలపాడు రోడ్డులోని గేదెల ఫారంకు పశువుల దాణా అందించేందుకు లోడ్‌తో వెళ్లాడు. ఆ సమయంలో ప్రశాంతినగర్ వద్ద 24వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు, అతని అనుచరులు ఆటోను నిలిపివేశారు. తాము వాణిజ్యపన్నుల శాఖ అధికారులమని, పశువుల దాణాకు సంబంధించి వేబిల్లులు బయటకు తీయాలని బెదిరించారు. బిల్లులు లేవని చెప్పటంతో రూ.5 వేలు ఇవ్వాలని లేకుంటే ఆటో సీజ్ చేస్తామని బెదిరించారు. విషయాన్ని డ్రైవర్ యజమాని వేణుగోపాల్‌రెడ్డి సోదరుడు బ్రహ్మారెడ్డికి తెలియజేశాడు. అతను వచ్చి ఆరా తీయగా టీడీపీ నాయకులని తెలుసుకొని వారితో వాగ్వివాదానికి దిగారు. అయితే వచ్చింది తమ ప్రభుత్వమని కప్పం కడితేనే ఆటో విడిచిపెడతామంటూ బెదిరించారు. సమాచారం అందుకున్న వన్ టౌన్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అదే సమయంలో టీడీపీ నాయకుడి అనుచర గణం పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకొని పోలీసుల చేతిలో ఉన్న లాఠీలను తీసుకొని ఆటో డ్రైవర్‌తోపాటు బ్రహ్మారెడ్డిపై దాడికి పాల్పడ్డారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై టీడీపీ నాయకులు దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించారు.

ఐక్యంగా జిల్లా అభివృద్ధికి కృషి

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- కేంద్రం నుంచి పేదలకు ఇళ్లు మంజూరు చేయిస్తాం
- గుంటూరు జెడ్పీలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం
- జెడ్పీ స్థాయి సంఘాల్లో సభ్యులుగా ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎన్నిక





సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్. వేదికపై మంత్రి నాదెండ్ల మనోహర్, జెడ్పీ చైర్మన్ హెనీ క్రిస్టీనా, హాజరైన ఎమ్మెల్యేలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం సమష్టిగా ముందుకు వెళదామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని శనివారం గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీలోని ఏడు స్థాయీ సంఘాల్లో ఖాళీ అయిన సభ్యుల స్థానంలో కొత్తగా ఎన్నికైన ముగ్గురు ఎంపీలతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 17 మంది ఎమ్మెల్యేలను ఎన్నుకున్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. రాజకీయాలు ఎన్నికల్లో గెలుపోటములకే పరిమితం కావాలని, అధికారంలో ఉన్నప్పుడు కులమతాలకు అతీతంగా అందరినీ సమానంగా చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉందని చెప్పారు. దేశ వ్యాప్తంగా పేదలకు రెండు కోట్ల ఇళ్లను కేంద్రం మంజూరు చేయనుందని, ఇందులో మన రాష్ట్రానికి కనీసం 15 లక్షలు మంజూరు చేయించుకునేందుకు కృషి చేస్తున్నామని ఆయన వెల్లడించారు. గుంటూరు ఎంపీగా కేంద్రం నుంచి వివిధ పథకాల ద్వారా మరిన్ని నిధుల్ని తీసుకువచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతానని పేర్కొన్నారు. గ్రామీణ సడక్, ఉపాధి హామీ, జలజీవన్ మిషన్ వంటి పలు కేంద్ర పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు, కార్యాచరణ, అమలులో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

- ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమం కోసం కలిసి పని చేయాలని తెలిపారు. రాజకీయాల్లో కక్ష సాధింపు చర్యలకు తావు లేదని స్పష్టం చేశారు.
- మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన మాచర్ల ప్రాంతానికి జెడ్పీ నుంచి నిధులు మంజూరులో తీవ్ర వివక్ష నెలకొంటోందని తెలిపారు. మాచర్లకు ఇప్పటి వరకు కేటాయించిన నిధుల వివరాలు, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాల్ని బహిరంగపరిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు.
- బాపట్ల ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్రవర్మ మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణా, వినియోగదారులకు బియ్యం బదులు డబ్బులు ఇస్తున్న సంఘటనలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని కోరారు.
- తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో పైపులైను నిర్మాణాల పేరుతో రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేస్తున్నారని తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత రీతిలో చర్యలు చేపట్టాలని కోరారు.
- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ అంతా కలిసి ప్రాంత అభివృద్ధికి పాటుపడదామని, వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు తమతో కలిసి పని చేయాలని ఆయన కోరారు.

ఏడు సంఘాల్లో సభ్యులు ఏకగ్రీవ ఎన్నిక

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సభ్యుల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రణాళిక ఆర్థిక సంఘంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు నియమితులయ్యారు.

- గ్రామీణాభివృద్ధి సంఘంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్ర వర్మ, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఎన్నికయ్యారు.
- వ్యవసాయ సంఘంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఉన్నారు.
- విద్య–వైద్యం సంఘంలో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి నియమితులయ్యారు.
- మహిళా సంక్షేమ సంఘంలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఉన్నారు.
- సాంఘిక సంక్షేమ సంఘంలో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర నియమితులయ్యారు.
- పనులు–రవాణా సంఘంలో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో జెడ్పీ సీఈవో ఎన్.వి.బి.ఎస్. వసంతరాయుడు, డెప్యూటీ సీఈవో జె.మోహనరావు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల వ్యవస్థ ప్రక్షాళన



రాష్ట్రంలో పౌరసరఫరాల వ్యవస్థ ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా గత రెండు నెలల్లో రూ.155 కోట్ల విలువైన 53వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. పార్టీలకు అతీతంగా కలిసి పని చేసి, నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేద్దామని ఆయన చెప్పారు.

నిధులు మంజూరు చేయాలి



జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన జెడ్పీ కార్యాలయ పరిపాలన భవనాన్ని నిర్మించడానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించడానికి కృషి చేయాలని మంత్రి పెమ్మసానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో పలుమార్లు విజ్ఞప్తి చేశామని చెప్పారు. ఇసుక సీనరేజీ, మైనింగ్, స్టాంప్ డ్యూటీకి సంబంధించి ప్రభుత్వం నుంచి జెడ్పీకి రావాల్సిన నిధులు విడుదల చేయాలని అప్పటి సీఎం వైఎస్. జగన్ దృష్టికి తీసుకెళ్లిన మీదట దానికి ఆయన అంగీకరించినప్పటికీ, ఆర్థికశాఖ అధికారులు నిలిపివేశారని తెలిపారు.

సమస్యలు చర్చిస్తే బాగుండేది



ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చర్చించేందుకు అజెండా లేకుండా కేవలం సభ్యుల్ని ఎన్నుకునేందుకు సమావేశ నిర్వహణ ఎందుకని ప్రశ్నించారు. కీలకమైన వ్యవసాయం, సీజనల్ వ్యాధులు, విద్య, వైద్యం, తాగునీరు వంటి ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించేందుకు అవకాశం కల్పిస్తే బాగుండేదన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

జీజీహెచ్‌లో సీటీ స్కాన్ మిషన్ ప్రారంభం

రూ. 4 కోట్లతో ప్రభుత్వం ఏర్పాటు



ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి సత్యకుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ప్రభుత్వం రూ. 4 కోట్లతో కొనుగోలు చేసిన సీ టీ స్కాన్ మిషన్‌ను శనివారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ సీటీ స్కాన్ రిపేరు వల్ల రెండేళ్లుగా రోగులు ఇబ్బంది పడ్డారన్నారు. ప్రభుత్వం రూ. 4 కోట్లతో కొత్తదాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. మరో సీటీ స్కాన్‌ను రిపేర్లు చేయించి త్వరలో వినియోగంలోకి తెస్తామని చెప్పారు. నాట్కో ట్రస్టు వారు ముందుకు వచ్చి రూ. 45 కోట్లతో జీజీహెచ్‌లో క్యాన్సర్ సెంటర్ నిర్మాణం చేయడం అభినందనీయమని తెలిపారు. త్వరలోనే మరో వంద పడకల క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మించేందుకు ముందుకు రావడం నాట్కో ట్రస్టు నిర్వాహకులు నన్నపనేని వెంకయ్య చౌదరి పెద్దమనస్సుకు నిదర్శనమని తెలిపారు. ఆసుపత్రిలోని సమస్యలపై ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. జింఖానా రూ. 80 కోట్లతో మాతా శిశు సంరక్షణ భవన నిర్మాణం చేస్తోందని, సాధ్యమైనంత త్వరగా పేద ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా చేస్తామని తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం గ్రేడ్–2 సెంటర్‌గా ఉన్న జీజీహెచ్ క్యాన్సర్ సెంటర్‌ను గ్రేడ్–1 సెంటర్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని వెల్లడించారు. జీజీహెచ్‌లో సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. జీజీహెచ్‌ను, గుంటూరు వైద్య కళాశాలను రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకంలో రోగికి చికిత్సకు రూ. 25 లక్షలు ఇస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని, దాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఆయుష్మాన్ భారత్, ఎన్టీఆర్ వైద్య సేవలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, తెనాలి శ్రావణ్‌కుమార్, హెల్త్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులపై ప్రజల్లో గౌరవం పెరిగే విధంగా కృషి చేయాలి

ప్రభుత్వ వైద్యుల పై ప్రజల్లో మరింతగా గౌరవం పెరిగే విధంగా కృషి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సూచించారు. శనివారం సుశృత హాలులో వివిధ విభాగాల ఆచార్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో గౌరవం పెరిగే విధంగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర గ్రామీణభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ వచ్చే రెండేళ్లలో ఆసుపత్రి అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళతామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి సీఎస్ ఆర్ ఫండ్స్ కింద వివిధ బ్యాంకులు అందించిన 20 లక్షల రూపాయలు విలువ గల ఏసీలను కేంద్ర రాష్ట్ర మంత్రులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, సత్యకుమార్ ప్రారంభించారు.

సాగునీటి విడుదల కోరుతూ సచివాలయానికి తాళం

- రెండు గంటలసేపు ఉద్యోగుల విధులను అడ్డుకున్న రైతులు
- ఇరిగేషన్ ఏఈ హామీతో ఆందోళన విరమణ
- టీడీపీ గ్రూపు విభేదాల పర్యవసానమే ఆందోళన !

పాంచాళవరం (తెనాలి): సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు గ్రామ సచివాలయానికి తాళం వేశారు. ఉద్యోగుల విధుల్ని రెండుగంటలసేపు అడ్డుకున్నారు. ఈ ఘటన బాపట్ల జిల్లా అమృతలూరు మండలంలోని పాంచాళవరంలో శనివారం జరిగింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పాంచాళవరం గ్రామానికి చెందిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) మాజీ చైర్మన్ ఆధ్వర్యంలో పలువురు రైతులు ఉదయం 9.30 గంటలకే గ్రామ సచివాయానికి వెళ్లి తాళం వేశారు. ఉద్యోగుల్ని లోపలకు వెళ్లేందుకు వీల్లేకుండా చేశారు. సాగునీరు లేని కారణంగా వరి నాట్లు ఆలస్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెండు గంటల తర్వాత సమాచారం తెలిసిన గ్రామ సర్పంచ్ సచివాలయానికి చేరుకున్నారు. సచివాలయానికి, సాగునీటికీ ఏం సంబంధమని డీసీని, రైతుల్ని ప్రశ్నించారు. జలవనరులశాఖ అధికారుల్ని సంప్రదించి, నీటి విడుదలకు కృషిచేయాలని సలహానిచ్చారు. అక్కడ నుంచే కూచిపూడి ఇరిగేషన్ సెక్షన్ ఏఈతో ఫోనులో మాట్లాడారు. రైతులతోనూ మాట్లాడించారు. తగినంత నీరు విడుదల చేస్తామని హామీనివ్వడంతో రైతులు తాళాలు తెరిచారు. వాస్తవానికి డీసీ మాజీ చైర్మన్, గ్రామ సర్పంచ్ టీడీపీకి చెందినవారే. ఇద్దరి మధ్యా గ్రూపు విభేదాల కారణంగా రైతుల సమస్యను అడ్డుపెట్టుకుని సచివాలయానికి తాళం వేశారని చెబుతున్నారు. టీడీపీలోని అంతర్గత కలహాల పర్యవసానంగా జరిగిన ఘటన అయినందున దీన్ని గోప్యంగా ఉంచారు.

అల్లుకున్న స్నేహ బంధం పదిలం



తెనాలి: స్నేహ బంధమూ...ఎంత మధురమూ...అన్నాడో సినీ గేయకవి. 'నీ స్నేహితుడెవరో చెప్పు...నీ గురించి నేను చెబుతా' అనే వారున్నారు. 'జీవితంలో ఒక మంచి స్నేహితుడినైనా సంపాదించుకో' అని కూడా అంటారు. ఇవన్నీ స్నేహానికి ఉన్న విలువను తెలియజేస్తాయి. అయితే, మనిషి జీవితంలో భార్యా కుటుంబంతోపాటు స్నేహితుడికీ గల ప్రాధాన్యత రానురాను తగ్గిపోతోంది. నేటి చదువులు, చిన్నవయసునుండే పెరుగుతున్న స్వార్థం స్నేహబంధాలకు అవరోధంగా తయారవుతోంది. ఇలాంటి రోజుల్లో ఎప్పుడో కలిసిన స్నేహం దశాబ్దాలుగా కొనసాగడం గొప్ప విషయం. స్నేహితుల దినోత్సవం రోజున అలాంటి కొందరు స్నేహితుల పరిచయమిది.

స్నేహితుల మధ్య ఉద్యోగ విరమణ సభ

డీసీపీ పీవీ గణేష్‌కు అభినందన



మిత్రుల ఆత్మీయ కలయికలో అడిషనల్ డీసీపీ పి.వి.గణేష్‌కు అభినందన


స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజీలో 1978–81లో డిగ్రీ సీబీజెడ్ గ్రూపు చదివిన కొందరు విద్యార్థులు ఇప్పటికీ మంచి స్నేహితులుగా కొనసాగుతూ ఉండటం విశేషం. దాదాపుగా అందరూ ప్రభుత్వ ఉద్యోగులే. బాధ్యతలరీత్యా ఒక్కొక్కరు జిల్లాలు, రాష్ట్ర సరిహద్దులు దాటి ఎక్కడెక్కడో పని చేస్తున్నారు. ప్రస్తుతం రిటైరయ్యారు. డిగ్రీ పూర్తయిన దగ్గర్నుంచి వీరంతా తరచూ కలుసుకుంటూ ఉన్నారు. శుభకార్యాల్లో పాల్గొనటమే కాదు...వివిధ సందర్భాల్లో తామంతా చదువుకున్న తెనాలిలోనే కలుస్తున్నారు. ఆనందాన్ని పంచుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో సీటీసీ అడిషనల్ డీసీపీగా పనిచేసిన పీవీ గణేష్ రిటైర్మెంట్ అభినందనను తెనాలిలో జరుపుకున్నారు. స్నేహితులు పరస్పరం యోగక్షేమాల్ని తెలుసుకున్నారు. ఆ స్నేహితుల బృందంలోని సీహెచ్. బాబూరావు (రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు), రిటైర్డ్ టీచర్లు టి.ఎన్.ఆర్. సుందరరావు, నారిశెట్టి రాజాకల్యాణ్ రమేష్ (తెనాలి), కృష్ణమూర్తి, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరుగా చేసిన వి.చిదంబరరావు, లెక్చరర్ బి.జోసెఫ్‌రాజు, వ్యాయామ అధ్యాపకుడు శేషు (నరసరావుపేట,) పాత్రికేయుడు బీఎల్ నారాయణ, వ్యాపారి పురుషోత్తం (తెనాలి) తదితరులు హాజరయ్యారు. అందరికన్నా చివరగా రిటైరైన పోలీసు అధికారి పి.వి.గణేష్‌ను సత్కరించుకున్నారు. భవిష్యత్ ప్రణాళికలపై ముచ్చటించుకున్నారు. విందు భోజనం చేసి వీడ్కోలు తీసుకున్నారు. ఈసారి ఖమ్మంలో కుటుంబాలతో సహా సమావేశం కావాలని తీర్మానించుకున్నారు.

ఐదో తరగతి నుంచి స్నేహం



దారా శివరామప్రసాద్, పొన్నూరు మధుబాబు (ఇంటర్‌లో ఫొటో)

కొల్లిపర మండల గ్రామం తూములూరు నివాసి దారా శివరామప్రసాద్, అన్నవరం గొడపాలేనికి చెందిన పొన్నూరు మధుబాబుది అయిదో తరగతిలో ఏర్పడిన స్నేహ బంధం. తూములూరులో అయిదో తరగతి వేర్వేరు స్కూళ్లలో చదువుతుండే వీరు సాయంత్రం ఒకే ట్యూషనులో కలుసుకున్నారు. అక్కడ ఏర్పడిన స్నేహం మూడు దశాబ్దాలుగా కొనసాగుతోంది. అదే ఊళ్లో హైస్కూలు, ఇంటర్, తెనాలిలో డిగ్రీ తర్వాత శివరామప్రసాద్ సొంతూరులోనే వ్యాపారంలో స్థిరపడ్డారు. మధుబాబు పోలీస్ కానిస్టేబుల్‌గా హైదరాబాద్‌లో విధుల్లో ఉన్నారు. ఇన్నేళ్ల స్నేహంలో తాము ఒక్కసారి కూడా విభేదించుకోలేదని ప్రసాద్ చెప్పారు. ఎప్పుడు హైదరాబాద్ వెళ్లినా అక్కడుండే సోదరుడు, స్నేహితుడు ఇళ్లలో రెండేసి రోజులు గడపటం తప్పనిసరిని చెప్పారు. ఇద్దరికీ పెళ్లిళ్లయి ఇద్దరేసి కొడుకులు ఉన్నట్టు తెలిపారు.



దారా శివరామప్రసాద్, పొన్నూరు మధుబాబు (ఇప్పటి ఫొటో)

బంధుత్వంగా మారిన స్నేహం



త్రయంబక అవధాని, పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి

వారిద్దరూ విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగంలో ఏర్పడిన స్నేహం 34 ఏళ్లుగా కొనసాగుతోంది. పిల్లల్ని ఇచ్చిపుచ్చుకుని తమ స్నేహాన్ని బంధుత్వంగా మార్చుకున్నారు. తెనాలికి చెందిన పిశుపాటి త్రయంబక అవధాని, పొన్నపల్లి గోపాల కృష్ణమూర్తి మంగళగిరి దగ్గరలోని ఎర్రబాలెం యూపీ పాఠశాలలో పనిచేశారు. ప్రతిరోజూ తెనాలి నుంచి బస్సులో విధులకు వెళ్లేవారు. ఆ పరిచయంతో స్నేహం చిగురించింది. ఇద్దరూ సంగీత, సాహిత్య, తెలుగు భాషాభిమానులు, కవిత్వం చెబుతారు. సాహితీ సభలకు కలిసే వెళుతుంటారు. 'భువన విజయం' రూపకంలోనూ ఇద్దరూ కలిసి నటించారు. అష్టావధానంలో పృచ్ఛకులుగానూ ప్రతిభను చాటారు. అవధాని కుమార్తె మాధురీలత, గోపాకృష్ణ కుమారుడు సురేంద్రనాథ్‌కు వివాహం చేసి, తమ స్నేహాన్ని బంధుత్వంగా మార్చుకున్నారు.

వయోవృద్ధుల స్నేహ సంఘం



వయోవృద్ధుల ఫ్రెండ్స్ అసోసియేషన్ సమావేశం

స్థానిక గాంధీనగర్‌లో ఫ్రెండ్స్ అసోసియేషన్ 16 ఏళ్ల క్రితం ఏర్పాటైంది. పోస్టల్ శాఖలో పదవీ విరమణ చేసిన పి.పోలేశ్వరరావు అధ్యక్షతన ప్రతినెలా 3వ తేదీన సంఘ సభ్యులు సమావేశమవుతారు. మొత్తం 60 మంది సభ్యులు. ఎక్కువ మంది ఉద్యోగ, వ్యాపారాల్లో విశ్రాంతి తీసుకున్న 70 ఏళ్లకు పైబడినవారే. ఆత్మీయంగా పలకరించుకుంటారు. భావాల్ని పంచుకుంటారు. జాతీయ, అంతర్జాతీయ అంశాల్ని చర్చించుకుంటారు. ఆ నెలలో పుట్టిన సభ్యులకు అభినందనలు చెబుతారు. అల్పాహారం తీసుకుని మళ్లీ నెలకు కలుసుకుందామంటూ వీడ్కోలు తీసుకుంటారు.

క్లుప్తంగా

సమగ్రశిక్షలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని గుంటూరు సమగ్ర శిక్ష ఏపీసీ జి.వి జయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి (సీఎంఓ), ఎంఐఎస్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి(ఏఎస్ఓ) పోస్టులను ఒక్కోటి చొప్పున భర్తీ చేసేందుకు ఫారిన్ సరీ్వసు రూల్స్‌కు అనుగుణంగా జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న 55 ఏళ్ల లోపు వయసు గల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మాథ్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులలో పీజీ విద్యార్హతతో గుర్తింపు పొందిన వర్సిటీ, విద్యాసంస్థల నుంచి కంప్యూటర్ పరిజ్ఞానంపై డిగ్రీ, డిప్లొమా కలిగి ఉండాలని తెలిపారు. సీఎంఓ పోస్టు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పోస్టులకు ఎనిమిదేళ్లు, ఏఎస్ఓ పోస్టుకు ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసి ఉండాలని కోరారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 9వ తేదీ సాయంత్రం లోగా డీఈఓ కార్యాలయంలోని సమగ్రశిక్ష జిల్లా విభాగంలో అందజేయాలని సూచించారు. విద్యార్హతలతో పాటు ఇతర ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలపై తాము పని చేస్తున్న పాఠశాల పరిధిలోని అధికారితో అటెస్టేషన్ చేయించాలని తెలిపారు. పూర్తి వివరాలకు సమగ్రశిక్షగుంటూరు.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్‌లో సందర్శించాలని సూచించారు.

రేపు న్యాయవాదుల విధుల బహిష్కరణ

నగరంపాలెం: న్యాయవాదులు తప్పుడు కేసులు నమోదుకు నిరసనగా ఈనెల 5న జిల్లాలోని న్యాయవాదులు విధులు బహిష్కరించనున్నట్లు జిల్లా(లాయర్స్) బార్ ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి తెలిపారు. గుంటూరు నగరంపాలెం జిల్లా కోర్టు ఆవరణలోని గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం జిల్లా(లాయర్స్) బార్ ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. న్యాయవాది జి.గవాస్కర్‌పై, గుంటూరులోని న్యాయవాది బి.నాగరాజుపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ క్రమంలో జిల్లాలోని న్యాయవాదులు విధులను బహిష్కరించాలని పేర్కొన్నారు. సమావేశంలో అధ్యక్షులు పి.ప్రభాకర్ (తెనాలి), శ్రీనివాసరెడ్డి (గురజాల), సత్యప్రసాద్ (బాపట్ల), బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.5300, మోడల్ ధర రూ.4600 వరకు పలికింది.

మొబైల్ దుకాణాలు బంద్

- హోల్‌సేల్ దుకాణదారుల తీరుకు నిరసన
- ఇక్కట్లకు గురైన సెల్‌ఫోన్ వినియోగదారులు



బ్రాడిపేటలో సమావేశమైన మొబైల్ దుకాణదారులు

నగరంపాలెం: గుంటూరు నగరంలోని హోల్‌సేల్ దుకాణదారుల తీరుతో చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని మొబైల్‌షాప్ ఓనర్స్ అండ్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కొనకళ్ల సత్యం అన్నారు. హోల్‌సేల్ దుకాణదారులపై నిరసన వ్యక్తం చేస్తూ శనివారం గుంటూరు నగరంలోని మొబైల్ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి, బంద్ పాటించారు. అనంతరం కొత్తపేట, బ్రాడిపేటలో సమావేశం నిర్వహించారు. మా పొట్టలు కొట్టదు, మా సర్వీస్ మాకే కావాలి, న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. సత్యం మాట్లాడుతూ సుమారు ఇరవైకి పైగా హోల్‌సేల్ మొబైల్ దుకాణదారులు నగరంలో వ్యాపారాలు చేస్తున్నారని అన్నారు. మొబైల్ దుకాణదారుల వరకే సెల్‌ఫోన్ విడి పరికరాలను విక్రయిస్తామని గతంలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే కొన్నాళ్లుగా హోల్‌సేల్ కాకుండా రిటైల్ వ్యాపారాలు చేస్తున్నారని వాపోయారు. విడి పరికరాలతోపాటు మొబైల్ ఫోన్లకు మరమ్మతులు చేస్తున్నారని విమర్శించారు. దీంతో గుంటూరు నగరంలోని చిరు వ్యాపారులైన సుమారు 1,500 మంది మొబైల్ దుకాణదారులు, వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అసోసియేషన్ తూర్పు అధ్యక్షుడు సెల్‌బాబు మాట్లాడుతూ హోల్‌సేల్ దుకాణదారుల నుంచి తమకు న్యాయం చేయాలని అన్నారు. పశ్చిమ అధ్యక్షుడు నాగవేణు మాట్లాడుతూ కొందరి వలన చిరు వ్యాపారం చేసే దుకాణదారులకు సరైన వ్యాపారాల్లేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.

తప్పని ఇక్కట్లు..

గుంటూరు పశ్చిమ, తూర్పులోని మొబైల్ దుకాణాలను మూసివేయడంతో మొబైల్‌దారులు ఇబ్బందులకు గురయ్యారు. సెల్‌ఫోన్లు మరమ్మతులు, రీచార్జి, ఇతరత్రా మొబైల్ పనులు చేయించుకునేందుకు దుకాణాల వద్దకెళ్లగా, దుకాణాలు మూసివేయడంతో వెనుదిరిగారు. ప్రధానంగా బ్రాడిపేట, లక్ష్మీపురం, గుజ్జనగుండ్ల, అరండల్‌పేట, నాజ్ సెంటర్, కొత్తపేట, పాత లీలామహల్ థియేటర్, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ వైపు రాకపోకలు సాగించే వారు ఎక్కువ ఇక్కట్లకు గురయ్యారు. ఉదయం పది నుంచి రాత్రి వరకు దుకాణాలు మూసివేశారు.

విభజన చట్టం అమలులో కేంద్రం వైఫల్యం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

లక్ష్మీపురం: విభజన చట్టం అమలులో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని బాలనంద కేంద్రం సమావేశ మందిరంలో రాజ్యాంగ చర్చా వేదిక ఆధ్వర్యంలో 'విభజన చట్టం – రాష్ట్ర పునర్నిర్మాణం, రాజ్యాంగం ప్రకారం కేంద్రం బాధ్యత' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో ప్రధాన వక్తలుగా ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణం కేంద్రం బాధ్యత కాగా గ్రాంట్‌గా ఇవ్వాల్సిన రూ.15 వేల కోట్లను రాజధానికి అప్పు ఇచ్చారని విమర్శించారు. న్యాయవాది నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం పూర్తి స్థాయిలో పునరావాస ఖర్చులు కేంద్రమే భరించాలని విభజన చట్టంలో ఉందన్నారు. రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షుడు నడింపల్లి గురుదత్ మాట్లాడుతూ యువతలో రాజ్యాంగంపై అవగాహన కల్పించాలని కోరారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలు కాపాడేందుకు విద్యార్థులు చైతన్యవంతం కావాలన్నారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ విభజన హామీల అమలుకు ప్రజాసంఘాలు ఫెడరేషన్ ఏర్పాటు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడం ఒక్కటే మార్గమని పిలుపునిచ్చారు. రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి మాట్లాడుతూ విభజన నాటికి దక్షిణాదిన అగ్రభాగాన ఉన్న ఏపీ తలసరి ఆదాయం ఏక పక్ష విభజన కారణంగా అట్టడుగు స్థానానికి పడిపోయిందన్నారు. కార్యక్రమంలో కొల్లా రాజామోహన్, తాతా సేవకుమార్, కిలారి రాజన్ బాబు, కొండా శివరామి రెడ్డి, వ్యవసాయ ఆర్థిక వేత్త జొన్నలగడ్డ రామారావు పాల్గొన్నారు.

దూరవిద్యలో సైన్స్ కోర్సులకు అనుమతివ్వండి

యూజీసీ జాయింట్ సెక్రటరీని కోరిన ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు



రాజ్‌కపూర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ: గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ద్వారా గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యను మరింత చేరువ చేసేందుకు సహకరించాలని యూజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అవిచల్ రాజ్‌కపూర్‌ను ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు కోరారు. అకడమిక్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన యూజీసీ జాయింట్ సెక్రటరీని శనివారం ఏఎన్‌యూ వీసీ, ఉన్నతాధికారులు కలిశారు. ఏఎన్‌యూలో సైన్స్ కోర్సులు నిర్వహించేందుకు అనుమతి కోరుతూ జాతీయ స్థాయిలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో(డెబ్)కు యూనివర్సిటీ దరఖాస్తు చేసిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంజూరుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. రిపోర్టును ఏఎన్‌యూ దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు అందజేశారు. జాయింట్ సెక్రటరీని కలిసిన వారిలో ఏఎన్‌యూ దూరవిద్యాకేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్, సీఎస్ఆర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్‌వీ రమణ ఉన్నారు.

గాంధీ ఆశయాలే ఖాదీబండారు లక్ష్యం

జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత

తాడేపల్లిరూరల్: గాంధీ ఆశయాలే ఖాదీబండారు లక్ష్యమని, ఆ దిశగానే ఖాదీబండారును నిర్వహిస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ దిశగా పరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. మంగళగిరి రూరల్ పరిధిలోని యర్రబాలెంలోని ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. తొలుత కార్యాలయంలోని అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పరిపాలన జరుగుతోందని వివరించారు. జౌళిశాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా సీఎం ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని, దానిలో భాగంగా 26 జిల్లాల్లో జౌళిశాఖలో ఎటువంటి ఉపాధి అవకాశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించేందుకు రూ.5 లక్షల నుంచి 50 లక్షల వరకు సబ్సిడీపై రుణాలు అందించి వ్యాపారాలను ప్రోత్సహిస్తామని, సంవత్సరంలో 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జౌళిశాఖ సీఈఓ విజయ రాఘవ నాయక్, ఎఫ్ఏ(ఫైనాన్స్ అడ్మినిస్ట్రేటర్) రవికుమార్, డి.డి.రమేష్, సీనియర్ అసిస్టెంట్ సవాన్, ఏడీలు రషీద్, రావు, తెలుగు మహిళా సంఘం నాయకురాలు ఆకుల జయసత్య పాల్గొన్నారు.

డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



సర్టిఫికెట్లు అందుకున్న డ్రైవర్లతో ఆర్ఎం రవికాంత్

పట్నంబజారు: ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ చెప్పారు. గుంటూరు జిల్లా పరిధిలోని ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌కు సంబంధించి శిక్షణ పూర్తి చేసుకున్న 15వ బ్యాచ్ డ్రైవర్లకు ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఆర్ఎం రవికాంత్ మాట్లాడుతూ డ్రైవర్లు మత్తు పానీయాలకు దూరంగా ఉంటూ, డ్రైవింగ్ చేసే సమయంలో సమయస్ఫూర్తి ప్రదర్శించాలని కోరారు. ప్రమాద రహితంగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ అబ్దుల్ సలాం మాట్లాడుతూ డ్రైవింగ్ స్కూల్‌లో ప్రతిరోజూ ఒక గంట వాహన భాగాల గురించి వివరించడంతో పాటు, రోడ్డు సిగ్నల్‌లు, ఇతర అంశాల గురించి డ్రైవర్లకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఘాట్ రోడ్లలో ఎలాంటి భయం లేకుండా డ్రైవింగ్ చేలా శిక్షణ ఇచ్చామన్నారు. 15వ బ్యాచ్ ముగిసిన నేపథ్యంలో, 16వ బ్యాచ్ ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు– 1 డిపో మేనేజర్ రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అనుమానాస్పద మృతి

చేబ్రోలు: మండల కేంద్రమైన చేబ్రోలు గ్రామ శివారులోని మామిడితోటలో అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. చిలకలూరిపేట మండలం గణపవరం ప్రాంతానికి చెందిన మల్లారం శివకృష్ణ(45) బతుకుదెరువు నిమిత్తం చేబ్రోలు వచ్చి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. స్థానికంగా ఒక మహిళతో సహజీవనం చేస్తున్న శివకృష్ణ ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. శనివారం ఉదయం జీబీసీ రహదారి పక్కన గ్యాస్ కంపెనీ ఎదురుగా ఉన్న మామిడితోటలోని చెట్టుకు ఉరివేసుకొని వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శివకృష్ణ మృతదేహంపై గాయాలు ఉండటం, మృతదేహానికి సమీపంలో వాటర్ బాటిల్, అగ్గిపెట్టె, మందులు ఉండటం పలు అనుమానాలకు దారి తీసింది. పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహోన్నత సేవాతత్పరులు అర్చకులు

ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యసీతారామశర్మ



జిల్లా నూతన కార్యవర్గంతో సత్యసీతారామశర్మ, ఇతర రాష్ట్ర నాయకులు

తెనాలి: ప్రతినిత్యం తన నిత్య అనుష్టానం, నిత్య దేవాలయ దేవతామూర్తుల అర్చనలు, నిరంతరం దేశ, రాష్ట్ర, రాజు, యజమాని, ఆచార్య, పరిజనుల క్షేమాన్ని కోరుకుంటూ సంకల్పించే మహోన్నతమైన సేవాతత్పరుడు దేవాలయ అర్చకుడని ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యనమంద్ర సత్యసీతారామశర్మ(మురమళ్ళ రాంబాబు) అన్నారు. తెనాలి రూరల్ మండలం నందివెలుగులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ అర్చక సంఘం గుంటూరు జిల్లా ఆత్మీయ సమావేశం, గుంటూరు జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి సత్యసీతారామశర్మ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ అర్చకుని మన్ననలు, ఆశీస్సులను పొందిన ఏ వ్యవస్థ అయినా నిరంతరం సుభిక్షంతో వర్ధిల్లుతుందని చెప్పారు. ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ అర్చక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పత్రి అనిల్ కుమార్ మాట్లాడుతూ సంఘం వెన్నంటి ఉంటుందని, సంఘ పురోభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుంటుందని అన్నారు. అలాగే సంఘానికి ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్రగా చేయూతనిచ్చి ప్రోత్సహించాలన్నారు. ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ అధికార సంఘ కోశాధికారి మురికిపూడి కృష్ణకిషోర్ మాట్లాడుతూ సంఘ నిబంధనలకు ప్రతివారూ కట్టుబడి ఉండాలని చెప్పారు. ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ అర్చక సంఘం గుంటూరు జిల్లా నూతన అధ్యక్షుడు కొలకలూరి శ్రీనివాసశర్మ, ప్రధాన కార్యదర్శి పోగుల మురళీకృష్ణశర్మ, కోశాధికారి కొడవటికంటి నాగపర్వతయ్య శర్మ, ఇతర పాలకవర్గ, కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు ప్రమాణం చేయించారు. రాష్ట్ర సంఘ మహిళా ప్రతినిధి కొల్లిపర శర్వాణి, ఆగమ పండితులు మామిళ్లపల్లి మృత్యుంజయప్రసాద్, మామిళ్లపల్లి సుబ్బరాయ శర్మ, నాగలింగం హరిహర పంత్, సంగాపు సంగమేశ్వర రావు, కుందుర్తి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత శ్రీకాంతాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేశారు.